సార్లు యే పని జెప్తరో! జంటలుండాలే. నీ వొక్కనితోటి యేడైతదే ముసలోడా?' అన్నడు సూరడు.

''అయ్యో. ఆరం సంది పని లేకవాయే. గుడిసెల పొద్దుందాకా యేం జేద్దూ! యెంచర్ల పనైతే యేంది. నేను జూడనిదా. జేయ్యనిదా. నా పని నేనే జేత్త. ఓ దమ్ము గడ్డపారేత్తా. ఓ దమ్ము తట్టెత్తుకుంట. ముసలోడంటివేందిరా? పనిల యేనాడన్న సాయమడిగితినా నిన్ను. జేయకుండ తప్పించుకుంటినా? పని రానిదే గిడిదాకా అచ్చిన్నారా? నిన్నియాల నా ముందు పుట్టి పెరిగితివి. నాకే జెప్పవడ్తివేందిరో.'' అని జరంత కోపంగ అన్నడు.

మధ్యల నర్సిగాడు కలగజేసుకుంట.. 'ఓ మావా నువ్వేడ జేత్తావే గా పని. పెద్ద సారు సూత్తే మూసలోన్ని పట్టుకచ్చినరని మా మీద కోపమైతడు. యెనిమిద్రోజుల పని. నీ వల్ల కరబ్ చేసుకోవాల్నా?' గద్దించి అన్నడు.

పక్కనుంచి యిదంతా యింటున్న మైసడు..

'యేందిరా గప్పటినుంచి సూత్తాన్న. పెయ్యి గులగుల వెడ్తుందా? గాడ్డి కొడుకా. నువ్వేమన్న వశ్నోనివారా. శేతనైన వోలే ఇద్దరు జేశే పని వొక్కనివే శెత్తాన్నవావా?' అని నర్సిగాని మీద గరమైండు.

మధ్యలొచ్చిన సూరీగాడ్ని గూడా.. 'ఊకో బాడకవ్. భలే మాట్లడతాన్నవ్. కులపోడూ. మనల్ని నమ్ముకొని వొచ్చిండు. ముసలోడు అత్తాంటే యెనకేసుకచ్చేది వొయ్యి.. పరాశ్కాలడ్తన్నవ్.' అనంగనే నాల్క సర్సుకున్నరు సూరడూ, నర్సిగాల్లు.

'నీ యవ్వ. యెవడేమంటడే సూత్తా. న్వుతే దావే పెద్దయ్య.' అని మైసడు అనంగనే.. మల్లడు మొఖాన యిన్ని నీళ్లు కొట్టుకుని తువాళ, గడ్డపార అందుకుని పయనమైండు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.

యెంచర్లకి వొంగనే సూపరైజరుకి దూరం నుంచే వో నమస్తే కొట్టిన్రు కులపోల్లు. అంతా వొక్క కాడా కూడిన్రు. పనిముట్లు శేతవట్టి పని షురు చేసిన్రు. భూమికి పలుగుడు వడుతున్నట్టు యెండ ఘోరంగా మండవట్టింది. ఇయ్యేవీ వట్టనట్టుగా మోగోళ్లంతా గట్టెమ్మటి గడ్డపారేసి తవ్వుతున్రు. ఆడోల్లంతా తట్టల్లో మట్టి నింపి శెట్లు వెట్టే సోట పోస్తున్రు.

గోశి సర్దుకుంట గడ్డపారేస్తున్న మల్లని నల్లటి పెయ్యి మీద.. శెమట నీరు నిగనిగ మెరుస్తాంది. సూత్తుండంగనే యెండ నడినెత్తికచ్చింది. గప్పటికే అల్సిపోయిన కులపోల్లంతా అన్నానికి దిగిన్రు. ఉప్పేసిన గంజన్నంల ఉల్లిగడ్డ, నిమ్మ తొక్కేసి జుర్రుతున్రు.

'రావే పెద్దయ్య. సల్లబడి, ఇంత తిందువు' అని మైసడూ, ఇంకొంతమంది పిలిశినా.. ఆకలైతలేదంటూ మల్లడు వోలే. పనిగాకుంటే పెద్దసారు గరమైతడని వొంట్లోని పాణవంతా తీసి మట్టిగడ్డ తవ్వుతనే ఉన్నడు.

మల్లనికి ఆకలి మీదకన్నా.. మనవని మీదకే పాణం గుంజుతాంది. 'గుడిసెకెప్పుడు వొవాల్నో. ఆనికింత డబ్రొట్టె వెట్టి, మందుగోళీ యెప్పుడెయ్యాల్నో' అన్న బాధే మనసుల మెదులుతాంది.

మల్లని పాలుకొచ్చిన పని సగం గూడ ఐతలేదని దూరం నుంచి జూస్తున్న కులపోల్లు అనుకుంటున్రు. అటుపక్క పని ఐపోవుడు సంగతి పక్కన వెడ్తే, తిండి లేక ముసలోని వొంట్లున్న వోపికైతే ఐపోవచ్చింది.

గట్టిగా వొక్క తవ్వుడు తవ్విన మల్లని గడ్డపారకి వో బండరౌతు తల్గింది. గడ్డపార మొన వంకరై, శేయి జారి కిందవడ్డది. అటెనక కాలూశేయిలు వణికి ముసలోడు గూడా వొక్కపారిగా కూలవడ్డడు.

''అయ్యో.. మల్లయ్య మావా కింద పడ్డడుర్లా'' అని తినే సద్దిని పక్కనేశి వురికొచ్చిన్రు కులపోల్లు.

మల్లన్ని లేపీ, పక్కకు కుసవెట్టే పనిల కొంతమందుంటే, ముసలోడ్ని తోలుకస్తే గిట్లనే వుంటదని సూరీగాడు, నర్సీగాడు అన్నరు. ఆళ్లంతా వొక్కకాడ మూగేసరికల్లా సూపరైజరూ అటొచ్చిండు.

''కూలికచ్చి అందరూ వొక్కకాడ గూడి ముచ్చట వెడ్తున్నార్రా?'' అని గుర్రుగా జూసిండు. పని మజ్జెల బండెళ్లిన ఇషయం గమనించిండు. ముసలోని గోస తెల్సుకుని అయ్యో పాపం అనుకుండు.

'వో ముసలోడా, గీ పనికొస్తివి. నీతోని యేడైతదే. యీళ్లంతా రక్తం మీదున్నరు. నీ వల్ల గాదుగాని, రేపటి సంది మాకు నీ అసోంటి జీతగాడొకడు గావాలే. యెంచర్ సుట్టూ శెట్లు వెడ్తరు. రోజూ వొచ్చి ఆటికి నీళ్లు వట్టాలే. నెలకు పదిహేనొందలిస్తం. జేరుతవా పనిల?' అన్నడు సూపరైజరు.

ఆ మాటతో మల్లని కళ్లల్ల నీళ్లాగాలే. కడుపు నిండినట్టయింది. దేవుడా, నా పోరన్ని సల్లంగా సూశినవ్ అని మనసుల మొక్కుకున్నడు. 'గట్లనే అయ్యా. నీ బంచాన్. రేపట్నుంచి పనిలకొస్త. జెప్పిన పని జేస్తా' అని సూపర్రైజర్తో అన్నడు.

ఆ మాటలకు మైసడు, ఆని పెళ్లాం, యింకొంత మంది కులపోల్లు మస్తు సంబురపడ్డరు. సూరిగాడు, నర్సిగాడు మాత్రం మూతి తిప్పుకున్నరు.

మల్లడు పస్తులున్న యిషయమిని.. ''సరేగానీ నాతో టిరా. మా పెద్ద సారు ఆఫీసు రూము కాడా యింత కూడు తిని కడుపు సల్ల జేసుకుందువు'' అన్నడు సూపర్రైజరు.

పెద్దొళ్లు పిలిశిర్రు, యెళ్లకపోతే యెట్లా అనుకుండు